భజే గణపతిం

పాత నగరంలో ఏళ్లుగా భక్తుల పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు

చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న పురాతన ఆలయాలు



ఆలయంలో కొలువైన లక్ష్మీగణపతి

డాబాగార్డెన్స్: పాత నగరంలోని వివిధ ప్రదేశాల్లో విఘ్నేశ్వరుడు వివిధ రూపాల్లో కొలువై విశేష పూజలందుకుంటున్నాడు. ఒక్కో చోట ఒక్కో విధంగా ప్రసిద్ధుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ నెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలు కానుండటంతో ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. తొలి, నవరాత్రి పూజలకు సర్వం సిద్ధం చేసే పనిలో ఉత్సవ నిర్వాహకులు, అర్చకులు నిమగ్నమయ్యారు.

వైశాఖేశ్వరాలయం.. బెల్లం గణపతి

వైశాఖేశ్వరుడి పేరిట ఈ ఊరికి విశాఖ అన్న పేరు స్థిరపడ్డ సంగతి తెలిసిందే. 14వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు బంగాళాఖాతం తీరంలో(కోస్టల్ బ్యాటరీ వద్ద) వైశాఖేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. దాని నమూనాతో ప్రస్తుతం కలెక్టరేట్ సమీపంలోని 30వ వార్డు అఫీషియల్ కాలనీ మూడో లేన్‌లో పునర్నిర్మించిన ఆలయమే బుచ్చిరామలింగేశ్వర ఆలయంగా పేరుపడింది. ఇక్కడ బెల్లం గణపతి కొలువై ఉన్నాడు. అన్ని ఆలయాల్లో వినాయకుడి తొండం కుడివైపునకు తిరిగి ఉండటం విశేషం. వినాయకుడి ఎదురుగా మోకాళ్లపై కూర్చుని తమ శక్తి మేరకు బెల్లం సమర్పిస్తానని మొక్కుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఈ వినాయకుడిని బెల్లం గణపతిగా పిలుస్తారు.

వరసిద్ధి వినాయకాలయం..

సీబీఎం హైస్కూల్ సమీపాన సుమారు 40 ఏళ్ల కిందట వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి చిన్న ఆలయాన్ని నిర్మించారు. ప్రతి బుధవారం సాయంత్రం స్వామికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేస్తారు. వరసిద్ధి వినాయకుడు కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. ప్రతి నెలాఖరు బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయి. సంకటహర గణేష్ హోమం క్రమం తప్పకుండా చేస్తారు. స్వామిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. టౌన్ కొత్త రోడ్డు వద్ద గల వరసిద్ధి వినాయకుడి ఆలయంలో విశేష పూజలు జరుగుతుంటాయి.

లక్ష్మీగణపతి ఆలయం..

ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డులో వందేళ్ల కిందట ఈ ప్రాంతమంతా కొండలు, గుట్టలమయంగా ఉన్న సమయంలో రాంబిల్లి సూర్యానారాయణ అనే వ్యక్తి ఇక్కడ స్థలం కొని ఇల్లు కట్టాడు. అనంతరం తమిళనాడుకు చెందిన పిళ్లై అనే సాధువుకు వినాయకుడు కలలో కనిపించి ఇక్కడ తవ్వితే తన విగ్రహం కనిపిస్తుందని చెప్పడంతో సూర్యనారాయణ సాయంతో తవ్వకాలు చేపట్టగా.. విగ్రహం కనిపించింది. లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ సమయంలో నాలుగు స్తంభాలతో గుడిని నిర్మించారు. కాలక్రమంలో దీన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడ భక్తులు గణపతికి బెల్లం పానకంతో అభిషేకం చేయిస్తారు.



వైశాఖేశ్వరాలయంలో కొలువైన బెల్లం గణపతి

స్వామి ముందు నిలుచుని గుంజీలు తీస్తారు.

పురాతన సిద్ధి వినాయక ఆలయం..

కురుపాం మార్కెట్ వద్ద గల పాత సాలిపేటలోని ఆలయం నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటి. వందేళ్ల కిందట ఈ ప్రాంతంలో నీటికి కరువు వచ్చినప్పుడు బావిని తవ్వుతుండగా.. వినాయకుని విగ్రహం బయటపడింది. విగ్రహానికి ఎడమ పార్శ్వం ఉండదు. విగ్రహ ప్రతిష్ఠ వెంటనే జరిగినా.. కాలక్రమంలో ఆలయాన్ని నిర్మించారు. పిల్లల వివాహాలకు ఆటంకాలు ఎదురైనప్పుడు, బిడ్డలు పుట్టడం ఆలస్యమైనప్పుడు భక్తులు ఈ ఆలయాన్ని దర్శించి వినాయకుడికి మొక్కుకుంటే కోరిక నెరవేరుతుందని విశ్వాసం. ఈ ఆలయంలో భక్తులే స్వయంగా స్వామిని పూజించుకోవచ్చు.



టౌన్ కొత్త రోడ్డు వద్ద ఆలయంలో వరసిద్ధి వినాయకుడు



సీబీఎం హైస్కూల్ సమీపాన వరసిద్ధి వినాయక ఆలయం



అఫీషియల్ కాలనీ మూడో లేన్‌లోని బుచ్చిరామలింగేశ్వరాలయం



ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులోని పురాతన లక్ష్మీగణపతి ఆలయం

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు నాలుగు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 3 వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, వెంకటేశ్వరరావు యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించారు.. రహదారిని మరిచారు



టౌన్ కొత్తరోడ్డు వద్ద నిర్మించిన కల్వర్టు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్త రోడ్డు వద్ద కల్వర్టు నిర్మించి.. రహదారి నిర్మాణాన్ని మరిచారని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. జగదాంబ నుంచి వన్ టౌన్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా రహదారి, కల్వర్టులు, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో టౌన్ కొత్తరోడ్డు వద్ద పెద్ద కల్వర్టు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. దీని వల్ల ప్రజలు ప్రధాన రహదారి నుంచి కాకుండా పోర్టుకు వెళ్లే దారి నుంచి వాహనాలు మళ్లించి పాతనగరం పాత పోస్టాఫీస్‌కు వెళ్లేవారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు స్పందించి టౌన్ కొత్తరోడ్డు వద్ద ఎట్టకేలకు ప్రధాన కల్వర్టు పనులు పూర్తి చేశారు. రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ ప్రాంతంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం కూడా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మెగా డీఎస్సీలో ప్రతిభ



లోవరాజు

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన సత్యాడ లోవరాజు ఏపీ మెగా డీఎస్సీ–2025 మెరిట్ లిస్ట్‌లో ప్రతిభ చాటాడు. స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ విభాగంలో స్టేట్ లెవెల్లో 40వ ర్యాంకు, టీజీటీ సైన్స్ రెసిడెన్షియల్ జోన్–1 కేటగిరీలో 70వ ర్యాంకు, టీజీటీ సైన్స్ మోడల్ స్కూల్ జోన్–1 కేటగిరీలో 120వ ర్యాంకు సాధించాడు. ప్రిపేరైన మూడు పరీక్షల్లో మంచి ఫలితాలు రావడంపై లోవరాజు హర్షం వ్యక్తం చేశాడు. ఆప్షన్స్‌లో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఎంచుకున్నట్టు సోమవారం 'సాక్షి'కి తెలిపాడు. ఈ సందర్భంగా లోవరాజును ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభినందించారు.

స్థానిక పత్రికలకు అక్రిడేషన్లు పెంచాలి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 84ను సవరించి స్థానిక పత్రికలకు అక్రిడేషన్లు పెంచాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అసోసియేషన్ ప్రతినిధుల బృందం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ముఖ్యమంత్రికి పంపే నిమిత్తం వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని పంపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో సత్యనారాయణ మాట్లాడుతూ ఈ జీవో స్థానిక దినపత్రికలకు ఎంతో నష్టం కలిగించేలా ఉందని తెలిపారు. స్థానిక దినపత్రికల జర్నలిస్టులకు ప్రెస్ అక్రిడేషన్లు సంఖ్యను ఇంకా తగ్గించడం అన్యాయమన్నారు. సీనియర్ జర్నలిస్టు పి.బాలభాను మాట్లాడుతూ తక్షణమే జీవో 84ను సవరించాలని, లేనిపక్షంలో ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బంగారు అశోక్‌కుమార్, నాయకులు కొయిలాడ పరశురాం, మెట్ట కృష్ణారావు, కమల్ కుమార్, రామరాజు, కె.సంతోష్‌కుమార్, అబ్బాస్, జె.శ్రీనివాస్, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రకృతిని పరిరక్షించాలి



హిందూ శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న సంత్ నిరంకారీ మిషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల హిందూ శ్మశానవాటికలో సంత్ నిరంకారీ మిషన్ నేతృత్వంలో ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిస్తూ సోమవారం మొక్కలు నాటారు. మిషన్ అధ్యక్షుడు ప్రేమ్ మిర్పురి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం కూడా నిస్వార్థ సేవలో పవిత్రమైన అంశమని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్య హానికర ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. బాబా హర్దేవ్‌సింగ్ మహారాజ్ సందేశాన్ని ప్రతిబింబిస్తూ కాలుష్యం, అంతర్గతంగా లేదా బాహ్యంగా హానికరమనే సందేశాన్ని నిరంకారీ మిషన్ ద్వారా యావత్ దేశంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. మానవాళి రక్షణకు చెట్లు నాటడం చాలా అవసరమని, నాగరికత, సంస్కృతిని ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని, సంరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఏఆర్ రాజు, రాజ్‌వీర్, రీతాజీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



33వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ వసంతలక్ష్మి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో రూ.1.44 కోట్లతో అభివృద్ధి పనులకు సోమవారం మేయర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నీలమ్మ వేపచెట్టు వద్ద శంకుస్థాపన చేపట్టారు. వార్డులో లీలామహల్ జంక్షన్ నుంచి నీలమ్మ వేపచెట్టు ఇందిరాగాంధీ కూడలి వరకు రూ.46.66 లక్షలతో బీటీ రోడ్డు పనులు, అల్లిపురం జంక్షన్ నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు రూ.48.3 లక్షలతో సీసీ డ్రెయిన్ పనులు, లీలామహల్ జంక్షన్ నుంచి సౌత్ జైలు రోడ్డు వరకు రూ.49.5 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మీతో కలసి శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, నాయకులు డాక్టర్ గోపీకృష్ణ, విళ్లూరి డాక్టర్ చక్రవర్తి, ఈఈ సత్యనారాయణ, ఇ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• 32వ వార్డు అల్లిపురం దేవాంగుల వీధిలో రూ.11 లక్షలతో సీసీ కాలువల అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ కందుల నాగరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు, ఈఈ కె.జి.ఎస్.నర్సింగరావు, డీఈఈ ఎ.వెంకటేశ్వరరావు, ఏఈ హేమకుమార్, కందుల కృష్ణ, శాలివాహన, బుజ్జి, అప్పారావు, అదిబాబు, బాబుల్ శ్రీను, బాబురావు, రెడ్డి, కుమారి, కందుల కేదార్నాథ్, కందుల బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ కాదు.. యూజీడీ పైప్‌లైన్



35వ వార్డులో ప్రధాన రహదారిపై తవ్వి వదిలేసిన యూజీడీ పైప్‌లైన్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో ఓ యూజీడీ పైప్‌లైన్ కాలువను తలపిస్తోంది. టౌన్ కొత్తరోడ్డు దరి జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డు వద్ద ఓ ఇంటి యాజమాని అండర్ గ్రౌండ్ కనెక్షన్ కోసం ప్రధాన రహదారిని తవ్వి పైప్‌లైన్ నిర్మాణం చేసుకున్నారు. తరువాత ఆ యజమాని పైప్‌లైన్‌పై సిమెంట్‌తో సక్రమంగా పూడ్చకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కాంక్రీట్ పూర్తిగా తొలగిపోయింది. దీంతో ఆ ప్రాంత ప్రధాన రహదారిపై కాలువలా ఏర్పడి వాహన చోదకులకు ప్రమాదంగా మారింది. కాంక్రీట్ రాళ్లు పైకి తేలి ఉండటంతో వాహనాల రాకపోకల సమయంలో సమీపంలో ఉండే వ్యక్తుల పైకి, వ్యాపార దుకాణాల మీదకు అవి తుళ్లుతున్నాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై గోతులను పూడ్చి ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

● చెట్టుకు చేటు





కలెక్టరేట్ వద్ద ఓ చెట్టుకు చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప కంచె లోపల కొందరు ప్లాస్టిక్ బాటిళ్లు వేసి డస్ట్ బిన్‌గా వినియోగిస్తున్నారు. దీంతో వృక్షానికి కంచె ఉన్నా.. రక్షణ లేకుండా పోయింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మట్టి ప్రతిమలనే పూజిద్దాం



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న మార్వాడీ సమ్మేళన్ ప్రతినిధులు



మట్టి గణపతిని అందిస్తున్న బోర శ్రీనివాసరెడ్డి తదితరులు

డాబాగార్డెన్స్: పర్యావరణాన్ని కాంక్షిస్తూ విశాఖపట్నం మార్వాడీ సమ్మేళన్ ఆధ్వర్యంలో సోమవారం మహారాణిపేటలో ఉచితంగా వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. సమ్మేళన్ మాజీ అధ్యక్షుడు చాంద్‌మాల్ అగర్వాల్, ప్రస్తుత అధ్యక్షుడు పోదేశ్వర్ పురోహిత్ భక్తులకు ప్రతిమలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి అంటే ప్రకృతని, భారతీయ సనాతన సంస్కృతని చెప్పారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక మార్వాడీ సమ్మేళన్ కార్యదర్శి రాజేష్‌కుమార్ కొఠారి, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ రాఠీ, సభ్యులు జితేంద్ర శర్మ, ప్రమోద్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

• సంఘ సేవకుడు చందక అప్పలరాజు ఆధ్వర్యంలో 29వ వార్డు దండుబజార్ డౌన్ రోడ్డులోని తన గృహం వద్ద 3 వేల మట్టి గణపతులు, 3 వేల వినాయక గొడుగులు, 3 వేల పాలవెల్లిలను స్థానికులకు ఉచితంగా అందజేశారు.

300 మట్టి విగ్రహాల పంపిణీ

అల్లిపురం: పర్యావరణ హితమైన మట్టి గణపతిని ప్రతి ఒక్కరూ పూజించాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపు మేరకు శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్మన్ బోర విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జరిగింది. బంగారుమెట్ట, సీబీఎం గర్ల్స్ స్కూల్ వద్ద స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 300 విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోర శ్రీనివాసరెడ్డి, భానోజీరావు, తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివ, వెంకటేష్, గంగా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు మట్టి ప్రతిమలు అందజేస్తున్న జోన్–4 కమిషనర్ మల్లయ్యనాయుడు

ఉద్యోగులకు మట్టి ప్రతిమల అందజేత

మహారాణిపేట: సూర్యాబాగ్‌లో జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి పర్వదినాన మట్టి ప్రతిమలను పూజించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ ఎండీ ఎం.రమేష్‌రెడ్డి, డీజీఎం పూర్ణిమ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి చింతకాయల బంగారురాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.వి.అశోక్‌కుమార్, నాయకులు సంతోష్ కుమార్, శ్యామలరావు పాల్గొన్నారు.

విజయ వినాయక

- సీతంపేటలో నవరాత్రి మహోత్సవాలకు సిద్ధమైన ఆలయం
- ఏటా తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహణ
- తమిళనాడు కళాకారులచే రోజుకో ప్రత్యేక అలంకారంలో స్వామి దర్శనం

భక్తుల బాంధవుడిగా నగరంలో ప్రసిద్ధి చెందిన దుర్గాగణపతి

సీతంపేట: దేవదాయ శాఖ పరిధిలోని సీతంపేటలో కొలువైన దుర్గాగణపతి ఆలయం నగరంలో ప్రసిద్ధమైనదిగా గుర్తింపు పొందింది. భక్తుల కోరికలు, తలపెట్టిన కార్యాలు విఘ్నం లేకుండా నెరవేరుతాయని స్థానికుల విశ్వాసం. దుర్గాగణపతిని పూజిస్తే విజయం సిద్ధిస్తుందని ప్రగాఢమైన నమ్మకం. ఈ నెల 27 నుంచి జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు, గణపతి హోమాలు, సహస్ర నామార్చన, మహా అభిషేకాలు, విశేష అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి దేవదాయ శాఖ, ఉత్సవ సేవా కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది.

ఆలయ చరిత్ర.. విశిష్టత

1980లో సీతంపేట కూడలిలోని ఖాళీ స్థలంలో స్థానిక యువత ఆధ్వర్యంలో విఘ్నేశ్వరా యువజన సేవా సంఘం ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో యువత క్యారెమ్స్ వంటి ఆటలు ఆడేవారు. భాద్రపద మాసంలో మాత్రం ఆ స్థలంలో మట్టి వినాయక విగ్రహాన్ని పెట్టి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేవారు. మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, పందిరి నిర్మించడం శ్రమతో కూడుకున్నది కావడంతో సంఘ ప్రతినిధులు ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. అదే తలంపుతో 1992లో శంకుస్థాపన చేశారు. తంజావూరు నుంచి దుర్గాగణపతి విగ్రహాన్ని తెచ్చి, 1993లో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారు. ఈ నెల 16న దుర్గాగణపతి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం, వినాయక చవితి రోజున దుర్గాగణపతి వెండి కవచం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అదే సంప్రదాయం నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆలయం దినాదినాభివృద్ధి చెందడంతో భక్తుల సంఖ్యపెరిగింది. గుడి ఆదాయం కూడా పెరగడంతో 2009లో దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి దేవదాయ శాఖ పరిధిలో ఆలయ నిర్వహణ, ఉత్సవాల పర్యవేక్షణ జరుగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వార్డు కార్పొరేటర్‌గా గెలుపొందిన సారిపిల్లి గోవింద్ చొరవతో సొంత నిధులు, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షలతో 2022లో ఆలయాన్ని శిల్పకళాకృతులతో అందంగా తీర్చిదిద్ది మహాసంప్రోక్షణ గావించారు.



ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాగణపతి ఆలయం



దుర్గాగణపతి నిజరూపం

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో..

ప్రతి ఏటా దేవదాయ శాఖ, వార్డు కార్పొరేటర్, ఉత్సవ సేవా కమిటీ సమన్వయంతో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల చివరి రోజున సిద్ధి, బుద్ధి సమేతంగా దుర్గాగణపతి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకీపై పురవీధుల్లో ఊరేగించడం సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది. ఈ ఊరేగింపులో పల్లకీ మోసిన వారికి శుభం జరుగుతుందని స్థానికుల విశ్వాసం. దీంతో పల్లకీ మోయడానికి యువత పోటీ పడుతుంటారు.

9 రోజులు.. వివిధ అలంకారాలు

ఈ నెల 27న వెండి కవచంలో దుర్గాగణపతి నిజరూప దర్శనం

28న	వాణి గణపతి
29న	లక్ష్మీ గణపతి
30న	విష్ణు గణపతి
31న	ఆదిత్య గణపతి
సెప్టెంబర్ 1న	శివబాల గణపతి
2న	స్కంద గణపతి
3న	త్రిముఖ గణపతి,
4న	అర్ధనారీశ్వర గణపతి అలంకారం

5వ తేదీ సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవమూర్తుల ఊరేగింపు

10వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నప్రసాద వితరణ